మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

మంగళవారం 07-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 167


## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District



## ఢిల్లీ అసెంబ్లీలో భద్రతా వైఫల్యం

- ఇనుప గేటును ధ్వంసం చేస్తూ దూసుకెళ్లిన కారు
- కారు సీజ్..నిందితుడి అరెస్టు

న్యూఢిల్లీ

ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. మాస్క్ ధరించిన ఓ వ్యక్తి వేగంగా కారు నడుపుతూ అసెంబ్లీ గేటును ఢీకొట్టి లోపలికి దూసుకెళ్లాడు. అనంతరం స్పీకర్ విజయేందర్ గుప్తా కార్యాలయం బయట పుష్పగుచ్ఛం ఉంచి, కారుపై సిరా విసిరి..అదే కారులో పరారయ్యాడు. వాహనానికి ఉత్తర్‌ప్రదేశ్ రిజిస్ట్రేషన్ ప్లేటు ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని చెప్పారు. వాహనం కోసం గాలింపు చర్యలు ప్రారంభించిన ఢిల్లీ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఫోరెన్సిక్ బృందంతో పాటు బాంబు స్క్వాడ్ అసెంబ్లీలో తనిఖీలు చేపట్టాయి. పుష్పగుచ్ఛంలో ఏమీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు.

-మిగతా 3 లో

# నీరు ఉంటే సంపద ఉన్నట్టే




## జల సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్

- రాష్ట్రానికి ద్రోహం చేసిన వైసీపీ
- జగన్‌కు పిచ్చి ముదిరి 'మావిగన్' మాటలు
- పెట్టుబడులు వస్తుంటే ఓర్వలేక కుట్రలు
- ఆడబిడ్డల జోలికొస్తే అదే చివరి రోజు
- 2027 గోదావరి పుష్కరాల్లోపే పోలవరం
- అనంతపురం.. జలధార సభలో చంద్రబాబు
- 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' యాప్ ఆవిష్కరణ

అనంతపురం, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):

"జలమే సంపద.. నీటిని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించవచ్చు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జలధారతో రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేలా జలహారతి కార్యాచరణ చేపడతామన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో జలధార, 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' అనే అంశంపై సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ముందుగా 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' పేరుతో రూపొందించిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ యాప్‌ను ఆవిష్కరించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. నీటిని సంరక్షించుకునేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను చేపట్టామన్నారు. ఇదొక మహోన్నత లక్ష్యమన్నారు.

-మిగతా 3 లో






## వర్షం కారణంగా కేకేఆర్, పీబీకేఎస్ మ్యాచ్ రద్దు

- ఐపీఎల్ 2026లో తొలి 'వాష్ అవుట్'
- 3.4 ఓవర్లకే ముగిసిన ఆట..
- ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో తొలిసారిగా ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది. సోమవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచుకు వర్షం అంతరాయం ఏర్పడింది. కేకేఆర్ బ్యాటింగ్ చేస్తుండగా 3.4 ఓవర్లలో 25/2 పరుగులు వద్ద వర్షం అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత వాన మళ్లీ తగ్గలేదు. దీంతో అంపైర్లు మ్యాచును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ఈ మ్యాచులో తొలుత టాస్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే ఇన్నింగ్స్ 3.4 ఓవర్ల వద్ద వర్షం ఎంట్రీ ఇచ్చింది. దీంతో ఇరు జట్ల ఆటగాళ్లు మైదానాన్ని వీడారు.

-మిగతా 3 లో



## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష..


- తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులోమదురై కోర్టు సంచలన తీర్పు

మదురై:

తండ్రీ కొడుకుల లాకప్ డెత్ కేసులో తొమ్మిది మంది పోలీసులకు ఉరిశిక్ష విధిస్తూ తమిళనాడులోని మదురై మొదటి తరగతి జిల్లా, సెషన్స్ కోర్టు సోమవారం సంచలన తీర్పు చెప్పింది. అలాగే వారికి రూ.కోటి జరిమానా విధించింది. బాధిత కుటుంబానికి ఆ మొత్తం చెల్లించాలని ఆదేశించింది. కొవిడ్ సమయంలో తమ దుకాణాన్ని తెరచి ఉంచారన్న ఆరోపణలపై జయరాజ్, అతని కుమారుడు బెనిక్స్‌ను తుత్తుకూడి జిల్లా సాతన్‌కుళం పోలీసులు 2020 జూన్ 19న స్టేషన్‌కు తీసుకు వచ్చారు.ఆ రోజు రాత్రంతా వారిని చితకబాది మరునాడు కోవిపట్టి సబ్‌జైల్‌కు తరలించారు. తీవ్ర గాయాలతో కోవిపట్టి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ బెనిక్స్ జూన్ 22న మరణించగా, అతని తండ్రి జయరాజ్ ఆ మరునాడు కన్నుమూశాడు.

-మిగతా 3 లో

## పాములు, మొసళ్లతో సరిహద్దు కాపలా!..



### అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు బీఎస్ఎఫ్ యోచన

న్యూఢిల్లీ,

భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో చొరబాటుదారులను నిరోధించడానికి పాములు, మొసళ్లను వినియోగించాలని సరిహద్దు భద్రతా దళ (బీఎస్ఎఫ్) వర్గాలు యోచిస్తున్నాయి. నదీతీర, చిత్తడి నేలల్లో చొరబాట్లను నిరోధించడానికి ఒక సహజ నిరోధంగా వీటిని వినియోగించాలని ఈ యోచన చేస్తున్నారు. భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో సంప్రదాయ ఫెన్సింగ్ వేయడానికి వీలుకాకుండా బలహీనమైన ప్రదేశాలు ఉన్నచోట వీటిని ఉంచాలని భావిస్తున్నారు. కాగా, 4,096 కి.మీ పొడవున ఉన్న సరిహద్దులో 175 కి.మీలు నదీతీర, చిత్తడి నేల ప్రాంతాలు

-మిగతా 3 లో

## తాత్కాలిక సంధికి నో!

### యుద్ధానికి శాశ్వత ముగింపు కావాలి

- ట్రంప్ కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరించిన ఇరాన్
- యుద్ధం ముగింపునకు 10 డిమాండ్లు
- పాకిస్థాన్ ద్వారా అమెరికాకు చేరవేత
- ఇరాన్ నిర్ణయంపై ట్రంప్ అసంతృప్తి
- భారీ మూల్యం తప్పదని హెచ్చరిక
- ఒక్క రాత్రిలో ఇరాన్ మొత్తాన్ని నాశనం చేస్తామని వార్నింగ్



న్యూఢిల్లీ,

అమెరికా నుంచి వచ్చిన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ సోమవారం తిరస్కరించింది. తన ప్రతిస్పందనను పాకిస్థాన్ ద్వారా అమెరికాకు తెలియచేసినట్లు ఇరాన్ అధికారిక వార్తాసంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ(ఇర్నా) తెలిపింది. తాత్కాలిక ఒప్పందానికి ఇరాన్ ఇష్టపడడం లేదని, యుద్ధానికి శాశ్వత ముగింపు అవసరమని


-మిగతా 3 లో

## చందమామ చెంతకు ఆర్టెమిస్-2

- నేడు తిరుగు ప్రయాణం..
- 10న ల్యాండింగ్

3 లో





## అమరావతికి ఆమోదం

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధ రక్షణ ప్రక్రియ సంపూర్ణం
- రాష్ట్రపతి ముర్ము ఆమోద ముద్ర.. గెజిట్ నోటిఫికేషన్ జారీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే ప్రక్రియ సంపూర్ణమైంది. ఇప్పటికే పార్లమెంటు ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లుపై రాష్ట్రపతి ఆమోద ముద్ర కూడా పడింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు-2026 సోమవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌కు చేరింది. సాయంత్రానికే దీనిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేశారు. రాత్రి 10 గంటలకల్లా 'గెజిట్ నోటిఫికేషన్' కూడా వెలువడింది.

-మిగతా 3 లో

## కాంగ్రెస్ పార్టీకి పాకిస్థాన్‌తో దోస్తీ

### 'కాంగ్రెస్ గెలవాలని పాక్ కోరుకుంటోంది'

- పాక్ స్క్రిప్ట్‌తోనే ప్రతిపక్షాల ప్రెస్ మీట్లు
- ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ పాటే పాడింది
- అస్సాం గడ్డపై మోదీ సంచలన ఆరోపణలు:
- అస్సాం ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):

కాంగ్రెస్ పార్టీ కి పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. సోమవారం అస్సాంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మోదీ.. దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తున్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్ పాటే పాడిందని

-మిగతా 3 లో





## కోహెడ భూములపై కన్నేశారా?

- రూ.3 వేల కోట్ల స్థల విక్రయానికి యత్నం
- ప్రభుత్వం వెనక్కి తగ్గాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

తుర్కయంజాల్

కోహెడ ఫ్రూట్ మార్కెట్‌కు కేటాయించిన సుమారు రూ.3 వేల కోట్ల విలువైన సుమారు 200 ఎకరాల భూములను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ కోహెడ మార్కెట్ స్థలాన్ని పరిశీలించిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో అంత ర్జాతీయ స్థాయి పండ్ల మార్కెట్ నిర్మాణానికి రూ.1000 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినప్పటికి, ప్రస్తుత ప్రభుత్వం టెండర్లు పిలవకుండా భూముల విక్రయానికి ప్రయత్నించడం అన్యాయమని అన్నారు. కొద్దిమంది దళారుల ప్రయోజనాల కోసం లక్షలాది మంది రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ సమీపంలోని విలువైన భూములను విక్రయించి, ఇతర ప్రాంతాలకు మార్కెట్‌ను మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

-మిగతా 3 లో

## యూఎస్ఎస్ ట్రిపోలీపై ఇరాన్ దాడి



**న్యూఢిల్లీ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
అమెరికాను మరో దెబ్బ తీసినట్టు ఇరాన్ ప్రకటించింది. యూఎస్ నౌక ఎల్‌హెచ్‌ఏ-7పై దాడి చేయడంతో అది దక్షిణ హిందూ మహాసముద్రంలోకి పలాయనం చిత్తగించిందని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఇజ్రాయెల్ ఎస్‌డీఎన్7 కంటైనర్ షిప్‌ను కూడా ధ్వంసం చేశామని తెలిపింది.ఆ దాడి ఎక్కడ చేసిందీ వివరించ లేదు. యూఎస్ఎస్ ట్రిపోలీగా కూడా పిలిచే ఎల్‌హెచ్‌ఏ-7 నౌక మార్చి మొదటి వారంలో పెద్దయెత్తున సైన్యంతో పశ్చిమాసియాలోకి అడుగుపెట్టింది. అయితే తమ యుద్ధ నౌకపై ఇరాన్ దాడి చేసిందీ లేనిదీ అమెరికా నిర్ధారించ లేదు

## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష..

**తండ్రీకొడుకుల లాకప్ డెత్ కేసులోమదురై కోర్టు సంచలన తీర్పు**




**మదురై: ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
తండ్రీ కొడుకుల లాకప్ డెత్ కేసులో తొమ్మిది మంది పోలీసులకు ఉరిశిక్ష విధిస్తూ తమిళనాడులోని మదురై మొదటి తరగతి జిల్లా, సెషన్స్ కోర్టు సోమవారం సంచలన తీర్పు చెప్పింది. అలాగే వారికి రూ.కోటి జరిమానా విధించింది. బాధిత కుటుంబానికి ఆ మొత్తం చెల్లించాలని ఆదేశించింది. కొవిడ్ సమయంలో తమ దుకాణాన్ని తెరచి ఉంచారన్న ఆరోపణలపై జయరాజ్, అతని కుమారుడు బెనిక్స్‌ను తుత్తుకూడి జిల్లా సాతన్‌కుళం పోలీసులు 2020 జూన్ 19న స్టేషన్‌కు తీసుకు వచ్చారు.ఆ రోజు రాత్రంతా వారిని చితకబాది మరునాడు కోవిపట్టి సబ్‌జైల్‌కు తరలించారు. తీవ్ర గాయాలతో కోవిపట్టి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ బెనిక్స్ జూన్ 22న మరణించగా, అతని తండ్రి జయరాజ్ ఆ మరునాడు కన్నుమూశాడు. దీంతో కేసు విచారించిన జడ్జి జీ ముత్తుకుమారన్ అప్పటి స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను నిందితులుగా పేర్కొంటూ వారికి మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.


## ఢిల్లీ అసెంబ్లీ వద్ద భద్రతా వైఫల్యం..

**- గేట్లు పగులగొట్టుకుని దూసుకెళ్లిన కారు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
ఢిల్లీ అసెంబ్లీ ప్రాంగణంలో భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. ఢిల్లీ అసెంబ్లీ ప్రాంగణం ప్రధాన ప్రవేశ గేట్లను పగులగొట్టుకుని లోపలకు దూసుకెళ్లిన ఓ గుర్తు తెలియని కారు అంతే వేగంతో నిష్క్రమణ గేటు నుంచి బయటకు వెళ్లిపోయింది. సోమవారం జరిగిన ఈ ఘటన అసెంబ్లీలో భద్రతా వ్యవస్థ వైఫల్యాన్ని బట్టబయలు చేస్తున్నది.గేట్లు పగులగొట్టి లోపలకు దూసుకెళ్లిన కారు డ్రైవర్ స్పీకర్ విజేందర్ గుప్తా కార్యాలయం వెలుపల వాహనాన్ని ఆపి కారులో నుండి దిగి ఓ పుష్పగుచ్ఛాన్ని వాకిలి వద్ద పెట్టి అదే కారులో బయటకు దూసుకెళ్లిపోయినట్లు అధికారులు తెలిపారు. టాటా సియెర్రా మోడల్‌కు చెందిన ఈ కారు రిజిస్ట్రేషన్ నంబర్ ఉత్తరప్రదేశ్‌దని వారు చెప్పారు. కేవలం ఐదు నిమిషాలపాటు లోపల ఉన్న కారు గేట్ నంబర్ 2 నుంచి బయటకు నిష్క్రమించిందని వారు తెలిపారు. కారు డ్రైవర్ ఎటువంటి అనుమానాస్పద వస్తువును వదిలిపెట్టి వెళ్లలేదని వారు చెప్పారు. నిందితుడిని సరబ్‌జీత్‌సింగ్‌గా గుర్తించిన పోలీసులు.. అతడిని ఢిల్లీలోని రూప్ నగర్ ఏరియాలో అనంతరం అదుపులోకి తీసుకున్నారు.

## సీఈసీపై అభిశంసన నోటీస్ తిరస్కరణ



**న్యూఢిల్లీ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు దాఖలు చేసిన అభిశంసన తీర్మానం నోటీస్‌ను రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ తిరస్కరించారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ కేంద్రంలోని అధికార బీజేపీ పట్ల అనుకూల వైఖరి కనబరుస్తున్నారని, విపక్ష పార్టీలపై పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ 63 మంది ఎంపీలు మార్చి 12న అభిశంసన తీర్మాన నోటీస్‌ను లోక్‌సభ, రాజ్యసభలో ప్రవేశపెట్టారు.ఆయన్ని సీఈసీ పదవి నుంచి తొలగించాలని ఆ నోటీస్‌లో కోరారు. ఆయనకు వ్యతిరేకంగా ప్రధానంగా ఏడు ఆరోపణలు చేశారు. కేంద్రంలోని బీజేపీకి లబ్ధిచేకూరేలా దేశవ్యాప్తంగా 'సర్' ప్రక్రియను ఈసీ చేపడుతున్నదన్నది విపక్షాలు చేస్తున్న ప్రధాన ఆరోపణ.

# మోదీ, పుతిన్, జిన్‌పింగ్..
# వీళ్లు మాత్రమే యుద్ధాన్ని ఆపగలరు

**జెఫ్రీ సాచ్స్**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
పశ్చిమాసియా సంక్షోభం యావత్ ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. అమెరికా-ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై చేస్తున్న దాడి ఆర్థిక సమస్యలు సృష్టిస్తున్నది. అయితే ప్రపంచ గమనాన్ని మార్చుతున్న ఇరాన్ యుద్ధాన్ని ఆపే శక్తి మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌లకు మాత్రమే ఉన్నట్లు అమెరికా ఆర్థికవేత్త, ప్రొఫెసర్ జెఫ్రీ సాచ్స్(జీవటటతీవఎ ఝఖష్త్రం) తెలిపారు. ప్రపంచ విధ్వంసాన్ని వీళ్లు మాత్రమే అడ్డుకోగలరని ఆ ప్రొఫెసర్ చెప్పారు. న్యూఆర్డర్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఆ ముగ్గురు నేతలకు మంచి గుర్తింపు ఉన్నదని, వాళ్లు ఎంతో పరిణితి చెందిన వ్యక్తులు అని, అయితే ప్రస్తుత సంక్షోభాన్ని మోదీ, పుతిన్, జిన్‌పింగ్ అడ్డుకోగలరన్నారు. అమెరికా దూకుడును ఈ ముగ్గురు నేతలు ఆపగలరని ఆయన అభిప్రాయపడ్డారు.ఇరాన్ యుద్ధం ఆగాలని, గొప్ప వ్యక్తులే దీన్ని ఆపగలరని, ప్రస్తుతం ప్రపచంలో ముగ్గురు వ్యక్తులకు మాత్రమే ఆ సామర్థ్యం ఉందని, ఆ ముగ్గురు కలిసి ఈ విపత్తును నివారించాలన్నారు. భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కీలకమైన వ్యక్తులు అని, మూడు సూపర్‌పవర్ దేశాలకు చెందిన నేతలని, ప్రపంచాన్ని వినాశనం నుంచి అడ్డుకోగలరని, బ్రిక్స్ లాంటి వేదిక ద్వారా ఈ యుద్ధాన్ని నిలువరించగలరని ఆయన అభిప్రాయపడ్డారు.భౌగోళికంగా, నాగరికత అంశంలోనూ భారత్‌కు అపార అనుభవం ఉందని, ఇలాంటి సమయంలో భారత్ నిష్క్రియాపరత్వాన్ని ప్రదర్శించరాదు అని, అమెరికా భ్రమలను కాదనే శక్తి, సామర్థ్యం, హోదా, గౌరవం అన్నీ భారత్‌కు ఉన్నట్లు జెఫ్రీ సాచ్స్ తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని నివారించేందుకు చైనా, రష్యాతో కలిసి భారత్ సంయుక్త నిర్ణయం తీసుకోవాలన్నారు. దృఢమైన దౌత్య విధానాన్ని భారత్ అవలంబించాలని, ప్రాంతీయంగా తమకు ఉన్న పరిచయాలను ఇండియా వాడుకోవాలని, ఇరాన్‌తో ఆ దేశానికి సుదీర్ఘమైన సంబంధం ఉందని, బహుళ విధానాన్ని ఆచరించాలని, బ్రిక్స్ కూటమి దేశాలు అమెరికాను వ్యూహాత్మకంగా అడ్డుకునే వీలు ఉన్నట్లు సాచ్స్ తెలిపారు.కొందరి ఇష్టానుసారం యుద్ధం జరుగుతోందని, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నారని, దీంతో ప్రపంచవ్యాప్తంగా మానవ, ఆర్థిక విపత్తు సంభవిస్తుందని ఆయన వెల్లడించారు. ఇరాన్ వార్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతున్నాయి, అయితే ఈ దశలో చర్యలు తీసుకోకుంటే ప్రపంచం తీవ్ర సంక్షోభంలోకి వెళుందని, ఇది ఒక దేశం పొరపాటు కాదు అని, ప్రపంచ సంక్షోభానికి దారి తీస్తున్నదని సాచ్స్ పేర్కొన్నారు. ఇరాన్‌పై పూర్తి స్థాయిలో దాడి చేస్తే అప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఇంధన శక్తి వ్యవస్థ దెబ్బతింటుందన్నారు.



# ఇరాన్‌కు మరో గట్టిదెబ్బ

**దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖాదేమీ మృతి**



**టెహ్రాన్ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
ట్రంప్ బెదిరింపుల వేళ ఇరాన్‌కు మరో గట్టిదెబ్బ తగిలింది. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ మజీద్ ఖాదేమీ మరణించారు. ఈ విషయాన్ని ఐఆర్‌జీసీ ధ్రువీకరించింది. అయితే ఆయన ఎక్కడ హతమయ్యాడనేది వెల్లడించలేదు. టెహ్రాన్‌లోని నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని సోమవారం ఉదయం ఈ దాడులు చోటుచేసుకున్నాయి. అమెరికన్-జియోనిస్ట్ శత్రువు తెల్లవారుజామున జరిపిన క్రిమినల్ టెర్రరిస్ట్ దాడిలో తమ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ మజీద్ ఖాదేమీ మరణించారని, ఆయన తన ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక వ్యక్తి అని ఐఆర్‌జీసీ వెల్లడించింది. గత ఏడాది జూన్ 12న ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో జనరల్ మమహ్మద్ కజేమీ మరణించడంతో ఆయన స్థానంలో మజీద్ ఖాదేమీ బాధ్యతలు చేపట్టారు. ఇజ్రాయెల్-అమెరికా సోమవారంనాడు జరిపిన భారీ దాడుల్లో 25 మందికి పైగా మరణించారు. ప్రతిగా ఇజ్రాయెల్, గల్ఫ్ అరబ్ పొరుగుదేశాలపై ఇరాన్ క్షిపణి దాడులు జరిపింది. ఫిబ్రవరి 28 ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు ప్రారంభించడంతో ఆ దాడుల్లో ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. అనంతరం ఇరాన్ అత్యున్నత భద్రతాధికారి అలీ లారీజాన్ మరణం ఇరాన్‌కు మరో గట్టిదెబ్బ అయింది. మార్చి 17న నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్, ఆయన కుటుంబ సభ్యులను అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త బలగాలు మట్టుబెట్టాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తీవ్రమైంది. ఈనెల 6లోగా హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని, లేదంటే ఇరాన్‌ను సర్వనాశనం చేస్తామని ట్రంప్ డెడ్‌లైన్ విధించారు. గడువు ముగుస్తుండటంతో ఇదే చివరి అవకాశం అంటూ ట్రంప్ మరో రోజు గడువును పొడిగిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు.

# కోల్‌కతాపై దాడి చేస్తామని
# పాక్ బెదిరిస్తున్నా నోరు మెదపరేం?


**మోదీని నిలదీసిన మమత.. రాజీనామాకు డిమాండ్**



**కోల్‌కతా:ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
భారత్ తమపై ఏదైనా దాడులకు పాల్పడితే కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు చేసినా ప్రధాని ఎందుకు నోరు మెదపడం లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహంతో ప్రశ్నించారు. కోల్‌కతాపై దాడి చేస్తామని పాక్ ప్రకటించినా మౌనంగా ఉన్న ప్రధాని వెంటనే రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. నదియా జిల్లాలో సోమవారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ 'మోదీ ఎన్నికల ప్రచారంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తారు కానీ పాక్ మంత్రి వాగుడుపై మాత్రం నోరెత్తరు.బెంగాల్ ఎన్నికల సభల్లో ప్రధాని ఈ విషయాన్ని ఎందుకు ప్రస్తావించరు? పాక్‌పై కఠిన చర్య తీసుకుంటామని ఎందుకు ప్రకటించరు?' అని మోదీ కూచ్ బెహర్ సభను ఉద్దేశించి ప్రశ్నించారు. కోల్‌కతాపై బెదిరింపులకు పాల్పడటాన్ని దేశంపై బెదిరింపులుగానే తాము పరిగణిస్తామని పేర్కొన్న ఆమె.. 'మేము భారత్‌పై బెదిరింపులను సహించం.. అలాగే కోల్‌కతాపై కూడా' అని అన్నారు.

# ట్రెక్కింగ్ చేస్తూ తప్పిపోయిన కేరళ యువతి క్షేమం..

**నాలుగు రోజులకు దొరికిన ఆచూకీ**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
కేరళ నుంచి కర్ణాటకకు వచ్చి ట్రెక్కింగ్ చేస్తూ తప్పిపోయిన జీఎస్ శరణ్య అనే యువతి ఆచూకీ దొరికింది. నాలుగు రోజుల తర్వాత ఆమెను రెస్క్యూ టీమ్ గుర్తించింది. దీంతో ఉత్కంఠకు తెరపడింది. కేరళలోని కోజికోడ్ జిల్ల?కు చెందిన జీఎస్ శరణ్య అనే ఐటీ ఉద్యోగిని ట్రెక్కింగ్ కోసం గత బుధవారం కర్ణాటక వచ్చింది. కొడుగు జిల్లా, తడియండమోల్ ప్రాంతంలో పర్వతారోహణకు వెళ్లింది. బుధవారం స్థానికంగా ఒక ఇంట్లో బస చేసి, గురువారం ఉదయం పర్వతారోహణకు వెళ్లింది అటవీ అధికారులు ఆమెను చెక్ పాయింట్ వద్ద వివరాలు సేకరించి, వేరే బృందంతో కలిసి పంపించారు. ఎనిమిది గంటలకు అందరితో కలిసి వెళ్లింది. 10.40 గంటలకు పర్వతారోహణ పూర్తి చేసుకుని బయల్దేరారు. ఈ క్రమంలో తను వేగంగా నడవడం, బృందంలోని మిగతా వారు కూడా తలోదిక్కుకు వెళ్లడం.. ఇలా చివరికి తను ఒంటరిగానే మిగిలిపోయింది. అయినప్పటికీ వేరే వాళ్లతో కలవడానికి ప్రయత్నించింది. కానీ, ఒక్కరు కూడా కనిపించలేదు. మధ్యాహ్నం తర్వాత తను బసచేసిన ఇంటి యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పింది. తాను తప్పిపోయానని సాయం చేయాలని కోరింది. ఇక తన స్నేహితులకు ఫోన్ చేసేలోపే ఫోన్ ఛార్జింగ్ అయిపోయింది. ఈ సమయంలో తను సాయం కోసం ఎదురుచూసింది. తను తప్పిపోయానని గ్రహించి ఒక చిన్న నీటి ప్రవాహం వద్ద ఉన్న రాయి మీద ఎదురుచూస్తూ ఉండిపోయింది. తనను వెతుక్కుంటూ ఎవరైనా వస్తారని నమ్మింది.

**నీళ్లు మాత్రమే తాగి..**

ఈ సమయంలో తను అక్కడ ఉండటానికి ఆహారం, నీరు లేవు. దీంతో నీటి ప్రవాహం వద్ద బాటిల్‌లో నీళు తెచ్చుకుని, తాగి, తనను తాను రక్షించుకుంది. వేరే మార్గంలో వెళ్లడానికి ప్రయత్నించినా, అది చివరికి దట్టమైన అడవిలోకి తీసుకెళ్లింది. అందుకే, ఆ రాయి ఉన్న చోటే ఉండిపోయింది. ఏనుగులు వంటి అటవీ జంతువులు ఉన్న పెద్దగా భయపడలేదని తెలిపింది. ఇలా నాలుగు రోజులు ఆ రాయి వద్దే ఉండిపోయింది. మరోవైపు నాలుగు రోజులుగా ఆమె కోసం అటవీ అధికారులు, పోలీసులు గాలించారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఆమెను సహాయక బృందాలు గుర్తించాయి. దీంతో ఆమెను సురక్షితంగా అడవి నుంచి బయటకు తీసుకొచ్చారు. ట్రెక్కింగ్ చేస్తూ తప్పిపోయినప్పటికీ, ట్రెక్కింగ్ చేయడం మాత్రం మానబోనని తెలిపింది.

# వర్షం కారణంగా కేకేఆర్, పీబీకేఎస్ మ్యాచ్ రద్దు

మొదటి తరువాయి



అప్పటికి జట్టు స్కోరు 25/2గా ఉంది. ఫిన్ అలెన్ (6), కామెరూన్ గ్రీన్ (4) పెవిలియన్ చేరారు. క్రీజులో కెప్టెన్ అజింక్య రహానే (8), ఎ.రఘువంశీ (7) ఉన్నారు.తొలుత చిన్నగా ప్రారంభమైన వాన ఎంతకీ తగ్గలేదు. ఇదే సమయంలో బలమైన గాలులు సైతం వీయడంతో ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం అయ్యారు. చాలా సేపటి తర్వాత వర్షం తగ్గింది. కానీ ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారడంతో మ్యాచ్ నిర్వహణ సాధ్యం కాలేదు. కనీసం ఐదు ఓవర్ల ఆట అయినా ఆడించేందుకు అంపైర్లు ప్రయత్నించారు. కానీ అది కూడా సాధ్యం కాలేదు. దీంతో చివరకు చేసేదేంలేక అంపైర్లు మ్యాచును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరు జట్ల కెప్టెన్‌లతో మాట్లాడిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.ఈ ఫలితంతో ఇరు జట్ల ఖాతాలో చెరో పాయింట్ చేరింది. ఐపీఎల్ 2026లో వర్షం కారణంగా రద్దు అయిన తొలి మ్యాచ్ ఇదే కావడం గమనార్హం. ఈ ఫలితంతో పంజాబ్ కింగ్స్.. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరింది. ఆ జట్టు ఖాతాలో ఐదు పాయింట్లు ఉన్నాయి. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్ తమకు దక్కిన తొలి పాయింట్‌తో పాయింట్ల ఖాతాను తెరించింది. ప్రస్తుతం ఆ జట్టు పాయింట్స్ టేబుల్‌లో 8వ ప్లేసులో ఉంది.

## ఢిల్లీ అసెంబ్లీలో భద్రతా వైఫల్యం

మొదటి తరువాయి

ఇటీవల ముగిసిన బడ్జెట్ సమావేశాల వేళ ఢిల్లీ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ క్రమంలో తాజా ఘటన చోటుచేసుకోవడం భద్రతా వైఫల్యాన్ని సూచిస్తోంది. భద్రతా లోపంగా పరిగణించి దర్యాప్తు చేస్తున్నామని ఢిల్లీ అసెంబ్లీ వర్గాలు పేర్కొన్నాయి.

## 9 మంది పోలీసులకు ఉరిశిక్ష..

మొదటి తరువాయి

దీంతో కేసు విచారించిన జడ్జి జీ ముత్తుకుమారన్ అప్పటి స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను నిందితులుగా పేర్కొంటూ వారికి మరణశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు

## పాములు, మొసళ్లతో సరిహద్దు కాపలా!..

మొదటి తరువాయి

ఉన్నాయి.ఇక్కడ భౌతికపరమైన అడ్డంకులు ఏర్పాటు చేయడం వల్ల స్మగ్లింగ్, ఇతర అక్రమ కార్యకలాపాలు, చొరబాట్లను నిరోధించడం చాలా కష్టతరం. కాగా, కొత్త ప్రణాళికకు అనుకూలంగా ఉన్న నదీతీర ప్రాంతాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని బీఎస్‌ఎఫ్‌ను ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే ఈ ప్రణాళిక ప్రస్తుతం చర్చల దశలోనే ఉందని, భవిష్యత్‌లో దీనిని అమలు చేస్తారో లేదో తెలియదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. కాగా, అదే సమయంలో డ్రోన్లు, సెన్సార్లు, కెమెరాలు, ఇతర రక్షణ వ్యవస్థలతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సరిహద్దుల్లో బీఎస్‌ఎఫ్ నిఘాను పటిష్టం చేసినట్టు ఆయన చెప్పారు.

## చందమామ చెంతకు ఆర్టెమిస్-2..

- నేడు తిరుగు ప్రయాణం..
- 10న ల్యాండింగ్



**న్యూఢిల్లీ**

దాదాపు 53 ఏండ్ల తరువాత మానవులు మరోసారి జాబిల్లి చెంతకు చేరారు. గత అర్ధశతాబ్ద కాలంలో అంతరిక్షంలోకి అడుగుపెట్టిన ప్రతి మానవుడూ విశ్వపు ఉపరితలాన్ని స్పృశించి వచ్చాడు తప్ప, అది దాటి అవతలికి వెళ్లలేదు. కానీ అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్రలో నలుగురు వ్యోమగాములు చంద్రుడి సమీపానికి చేరారు. వారిని తీసుకెళ్లిన ఓరియన్ వ్యోమనౌక ఈ నెల 6న 4,06,773 కిలోమీటర్లు ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది.ఇంతకుముందు 1970లో అపోలో 13 నెలకొల్పిన రికార్డు కంటే ఇది 2,500 కిలోమీటర్లు అదనం. వ్యోమనౌక భారత కాలమానం ప్రకారం ఈ నెల 7న అర్ధరాత్రి 12:15కు చంద్రుడి సమీపం నుంచి తిరుగు ప్రయాణం కానున్నది. ప్రస్తుతం అంతరిక్షంలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్) భూకక్ష్యలో 400 కిలోమీటర్ల దూరంలో ఉండగా, చంద్రుడు భూమికి 3,84,633 కిలోమీటర్ల దూరంలో ఉన్నాడు. ఇంతకుముందు అపోలో-13 4,00,171 కిలోమీటర్ల దూరం ప్రయాణించగా, ఆర్టెమిస్-2 మరో 2,500 కిలోమీటర్ల దూరం ఎక్కువగా ప్రయాణించనుంది. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తిచేశాక వ్యోమనౌక ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ కావచ్చు.

# నీరు ఉంటే సంపద ఉన్నట్టే

మొదటి తరువాయి



ఎన్టీఆర్ జలసిరి తీసుకొచ్చామని, ట్రెంచ్‌లు కొట్టామని,నీరు-చెట్టు, నీరు-ప్రగతి కార్యక్రమాలు అమలు చేశామని గుర్తు చేశారు.

**ఇన్‌పుట్ సబ్సిడీ ఇక్కడి నుంచే**

అనంత జిల్లాలో ఒకప్పుడు పదేళ్లలో 8 సంవత్సరాలపాటు పంటలు వచ్చేవి కాదు. రైతుల కష్టాలు చూసి చలించిపోయాను. తొలిసారిగా అనంత జిల్లా నుంచే ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీని ప్రారంభించాం. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు ఇచ్చిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే. ఈ ఏడాది 1.26 లక్షల హెక్టార్లకు మైక్రో ఇరిగేషన్ పరికరాలు ఇచ్చాం. ఈ విషయంలో దేశంలో నంబర్‌వన్‌గా ఉన్నాం. రాయలసీమలో ఉద్యాన పంటలకు మైక్రో ఇరిగేషన్ ఇచ్చాం. పండ్లు, కూరగాయలు పండించడంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాం. వచ్చే 6-7 ఏళ్లలో ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఖర్చు పెట్టడంతోపాటు మరో రూ.70 వేల కోట్ల మేరకు ప్రైవేటు పెట్టుబడులు తీసుకొచ్చి ప్రపంచస్థాయిలో సీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే బాధ్యత తీసుకుంటున్నాం. రైతులు కూడా శ్రద్ధ పెడితేనే ఇది సాధ్యపడుతుంది.

**21 నెలల్లో ఎన్నో మార్పులు**

అధికారంలోకొచ్చాక 21 నెలల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చాం. 28,628 చెరువులు ఉంటే.. వాటిలో 20 వేల చెరువులను నీటితో పూర్తిగా నింపాం. గతేడాది 10.62 మీటర్ల లోతులో ఉండే భూగర్భ జలాలను 8.7 మీటర్లకు తగ్గించాం. 1.92 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయి. రాష్ట్రంలో 40 శాతందాకా 3.08 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. అనంత జిల్లాలో 2024 ఏప్రిల్‌లో 11.36 మీటర్లలో ఉంటే... ప్రస్తుతం 11.25 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో జలధార జలసిరి కింద పెద్ద ప్రయోగం చేశాం, అక్కడ ఒకే సంవత్సరంలో 8 మీటర్ల దాకా భూగర్భజలాలు పెంచగలిగాం. అన్నమయ్య జిల్లాలో 5.71 టీఎంసీల భూగర్భ జలాలు పెరిగాయి. 30 నుంచి 40 శాతం బోర్లలో విద్యుత్ వాడకం తగ్గింది. ఒక జిల్లాలోనే రూ.96 కోట్ల విలువైన కరెంటు ఆదా అయ్యే పరిస్థితి వచ్చింది. బ్యాంకుల్లో డబ్బు ఎలా దాచిపెట్టుకుంటారో... నీటికి భూమిలోనైనా.. రిజర్వాయర్‌లోనైనా పెట్టుకోగలిగితే అదే సంపదను సృష్టిస్తుంది. ప్రజలందరూ ఐక్యం కావాలి. జలసిరి.. జలధారతో ప్రతి ఎకరాకీ జలహారతి ఇవ్వాలి. శ్రీశైలం నుంచి నీటిని తీసుకొస్తున్నాం. హెచ్చెల్సీ ద్వారా కొంత వరకు నీళ్లు వస్తున్నాయి. ఈ ఏడాది 74 టీఎంసీల నీళ్లు అనంతకు తీసుకొచ్చాం. పట్టిసీమలో నీరు లిఫ్ట్ చేసి, నేరుగా కృష్ణాడెల్టాకు తీసుకొచ్చాం. అక్కడ ఖరీఫ్, రబీ సీజన్లకు వాడే నీటిని పొదుపు చేసి, సీమకు మళ్లించి రతనాల సీమగా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. గంగ నుంచి కావేరి వరకు నదుల అనుసంధానం జరగాలి. అదే జరిగితే దేశంలో సంపదకు కొదవ ఉండదు. ఇదే విషయాన్ని ప్రధాని మోదీని అడిగా. ముందుగా రాష్ట్రంలో చేయమని, తర్వాత దేశంలో కూడా చేస్తామని ఆయన చెప్పారు.

# తాత్కాలిక సంధికి నో!

మొదటి తరువాయి



స్పష్టం చేస్తున్నట్లు ఇరాన్ స్పందన తెలియచేస్తున్నది. ఇరాన్ తన సమాధానంలో తక్షణ కాల్పుల విరమణతోపాటు 10 నిబంధనల ప్రణాళికను పొందుపరిచింది. ఇందులో పశ్చిమాసియా ప్రాంతమంతటా ఘర్షణలను అంతం చేయడం, హెర్ముజ్ జలసంధి గుండా సురక్షిత ప్రయాణానికి భరోసా ఇచ్చే నిబంధనలు అమలుచేయడం, ఇరాన్ పునర్నిర్మాణానికి సంబంధించిన ఆంక్షలు, నిబంధనలు ఎత్తివేయడం వంటి డిమాండ్లు ఉన్నాయి. తాము కేవలం కాల్పుల విరమణను మాత్రమే ఆమోదించబోమని కైరోలోని ఇరాన్ దౌత్య కార్యాలయ అధిపతి మొజ్తబా ఫిర్దౌసీ పోర్ సోమవారం అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపారు. ఇరాన్‌పై మళ్లీ దాడి జరగదన్న హామీలతో కూడిన యుద్ధ ముగింపును తాము ఆమోదిస్తామని ఆయన స్పష్టం చేశారు. గడువులోగా ఒప్పందానికి అంగీకరించకపోతే ఇంధన, మౌలిక సదుపాయాలను బాంబులతో పేల్చివేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన వెలువడింది. కాగా, పాకిస్థాన్ బలపరుస్తున్న కాల్పుల విరమణ ప్రతిపాదన తమ పరిశీలనలో ఉన్న అనేక ఆలోచనలలో ఒకటని వైట్ హౌస్ అధికారి ఒకరు సోమవారం సీబీఎస్ న్యూస్‌కు తెలిపారు. అయితే అధ్యక్షుడు ట్రంప్ దీనికి ఆమోదం తెలపలేదని, ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో సమాచార మార్పిడి మార్గాలను తెరచి ఉంచడానికి పాకిస్థాన్ తెరవెనుక నుండి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నది. పాకిస్థాన్‌తోపాటు ఈజిప్టు, తుర్కియే కూడా ట్రంప్ దూత స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య ప్రత్యక్ష సందేశాల మార్పిడికి దోహదపడుతున్నాయి.

**భారీ మూల్యం తప్పదు: ట్రంప్**

తన కాల్పుల విరమణ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం వెంటనే స్పందించారు. ఇరాన్ స్పందనతో తాను చాలా కలత చెందానని ఆయన తెలిపారు. ఒప్పందాన్ని కుదుర్చుకోవడంలో విఫలమైన పక్షంలో ఇరాన్ భారీ మూల్యాన్ని చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరిస్తూ తాను విధించిన గడువు సమీపిస్తున్న వేళ తను తీసుకునే వైఖరి ఎంత కఠినంగా ఉండగలదో ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. వాషింగ్టన్ డీసీలోని వైట్ హౌస్ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఇరాన్‌కు విధించిన మంగళవారం గడువులో ఎటువంటి మార్పు ఉండబోదని, అదే ఫైనల్ అని ట్రంప్ స్పష్టం చేశారు. వారు చేయాల్సింది చేస్తే ఇది(యుద్ధం) చాలా త్వరగా ముగిసిపోవచ్చు అని ఇరాన్‌ని ఉద్దేశించి ట్రంప్ చెప్పారు. వారు కొన్ని పనులు చేయాల్సిందే. ఆ విషయం వారికి తెలుసు. మొదటి, రెండవ దశలలో ఉన్న ఉన్మాదులతో పోలిస్తే అక్కడి ప్రజలు చాలా తెలివైనవారు అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ పార్టీకి పాకిస్థాన్‌తో దోస్తీ

మొదటి తరువాయి

ఆరోపించారు.కాంగ్రెస్, పాకిస్థాన్ సంబంధం ఇప్పటిది కాదని, ఎప్పటి నుంచో సాగుతున్నదని, ఇది జాతీయ భద్రతకు చాలా ప్రమాదకరమని ప్రధాని వ్యాఖ్యానించారు. ఆదివారం ఢిల్లీలో పవన్ ఖేరా, గువాహటిలో గౌరవ్ గొగోయ్ రెండు వేర్వేరు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారని, ఆ కాన్ఫరెన్స్‌కి సంబంధించిన మొత్తం సమాచారాన్ని పాకిస్థాన్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్టు తాము గుర్తించామని విమర్శించారు. అస్సాం ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలను నిర్వహించిందని, ఇలా ఇంతకు ముందెప్పుడూ జరగలేదని, ప్రతి షోలోనూ చివరకు కాంగ్రెస్ గెలవాలని చెప్పారని ప్రధాని తెలిపారు. ఆదివారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లలో పాకిస్థాన్ జోక్యం స్పష్టంగా వెల్లడైందని అన్నారు. ఇదిలావుంటే అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ సతీమణి రిణికి భూయాన్ శర్మకు మూడు దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దాంతోపాటు ఆమె ఆస్తులను ఆయన అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు కేసు నమోదు చేయొచ్చని, ఎన్నికల సమయంలో ప్రజలను ప్రభావితం చేసేందుకే ఇలాంటి విమర్శలు చేశారని హిమాంత కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు.ం

## కోహెడ భూములపై కన్నేశారా?

మొదటి తరువాయి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి భూముల వ్యవహారాలపైనే దృష్టి సారించిందని విమర్శించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. కోహెడ భూముల విక్రయాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, మార్కెట్ అభివృద్ధి వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బీఆర్‌ఎస్ నాయకులు క్యామ మల్లేశ్, వంగేటి లక్ష్మారెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, సత్తు వెంకట రమణారెడ్డి, కందాడ లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, దండెం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి ఆమోదం

మొదటి తరువాయి



దీంతో 'అమరావతి'కి కేంద్ర స్థాయిలో చట్టబద్ధమైన రక్షణ లభించినట్లయింది. రాష్ట్రపతి ఆమోద ముద్ర అనంతరం కేంద్ర న్యాయ శాఖ కార్యదర్శి రాజీవ్ మణి ఈ గెజిట్‌ను విడుదల చేశారు. 2014నాటి రాష్ట్ర పునర్విభజన చట్టంలో... 'పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుంది. ఆ తర్వాత ఏపీకి ఒక కొత్త రాజధాని ఉంటుంది' అని పేర్కొనగా... సవరణ చట్టంలో 'ఏపీకి అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది' అంటూ స్పష్టమైన వివరణ ఇచ్చారు. అలాగే... సీఆర్డీయే చట్టం-2014 కింద నోటిఫై చేసిన ప్రాంతమంతా 'అమరావతి' పరిధిలోకి వస్తుందని మరో సవరణ చేశారు. వెరసి... 2024 జూన్ 2వ తేదీ నుంచే నవ్యాంధ్ర రాజధానిగా అమరావతి అమలులోకి వచ్చినట్లయింది. రాజధాని అమరావతిపై చట్టబద్ధమైన స్పష్టత ఇప్పిస్తూ, రక్షణ కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. దీనిపై కేంద్రంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. ఈ ప్రక్రియ మరింత పకడ్బందీగా జరిగేలా... అసెంబ్లీలో తీర్మానం చేసి పంపాలని కేంద్రం సూచించింది. దీంతో... మార్చి 28న రాష్ట్ర శాసనసభ ప్రత్యేకంగా సమావేశమైంది. 2024 జూన్ 2 నుంచే అమరావతిని రాష్ట్ర రాజధానిగా గుర్తించేలా చట్ట సవరణ చేయాలంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఆ మేరకు 2014 చట్టంలోని సెక్షన్ 5లోని సంబంధిత సబ్ సెక్షన్లలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరింది. ఈ తీర్మానాన్ని అప్పటికప్పుడు ప్రత్యేక దూత ద్వారా ఢిల్లీకి పంపించారు. ఆ వెంటనే కేంద్రమూ కదిలింది. లోక్‌సభలో ఈనెల 1, రాజ్యసభలో 2వ తేదీన చట్ట సవరణ బిల్లుపై ఆమోద ముద్ర పడింది. దాదాపు 4.30 గంటలపాటు ఉభయసభలలో సవరణ బిల్లుపై చర్చ జరిగింది. ఇది సోమవారం రాష్ట్రపతి భవన్ చేరడం... రాత్రికే గెజిట్ నోటిఫికేషన్ జారీ కావడం విశేషం.



# రొమ్ము క్యాన్సర్‌కు ఈ ఆహారంతో చెక్

మహిళల ఆరోగ్యానికి ఏ ఆహారం తింటే మంచిది? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రతి నెలా రుతుక్రమ సమస్యల్ని ఎదుర్కొనే మహిళలు ఎలాంటి ఆహారం తీసుకుంటే మంచిదో వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవలికాలంలో మహిళలు రొమ్ముక్యాన్సర్ బారినపడేవారు ఎక్కువగా ఉంటున్నారు. మరి వారు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందామా?! ఇటీవల కాలంలో మహిళలు ఆరోగ్యంపై కాస్తంత దృష్టి పెడుతున్నారు. ఉదయాన్నే వ్యాయామాల కోసం సమయం వెచ్చిస్తున్నారు. లేకపోతే వ్యాయామాలు చేయకపోయినా.. ఆహారంలో మార్పులు చేసుకుంటున్నారు. వాటిల్లో ప్రధానంగా చెప్పుకోవాలంటే.. పచ్చి ఆకుకూర ముక్కలు, నానబెట్టన చిరు ధాన్యాలు ముందు వరుసలో ఉంటున్నాయి. వీటిని రోజూ ఆహారంలో భాగంగా తీసుకుంటే.. మహిళలు రొమ్ము క్యాన్సర్ బారినపడకుండా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు.

-- కూరగాయల ముక్కలు, నానబెట్టిన చిరుధాన్యాల్ని ఉదయాన్నే తీసుకుంటే... మానసిక ఒత్తిడికి దూరంగా ఉంటారని వైద్యులు సూచిస్తున్నారు. అధిక రక్తపోటుకు గురికాకుండా ఉంటారు. మధుమేహులకు కూడా ఇవి మంచిది.

- ఎముకలకు బలాన్ని చేకూరుస్తాయి. వీటిని తీసుకుంటే త్వరగా బరువు తగ్గుతారు.

అమెరికాలో 25 సంవత్సరాలు ఉన్న 25 వేల మంది మహిళలపై పరిశోధించగా.. వారు పచ్చి కూరగాయల ముక్కల్ని తీసుకుంటే.. అధిక బరువుకి దూరంగా ఉన్నారని తాజా అధ్యయనంలో తేలింది.



# వేసవిలో ఉప్పు నీటిని తాగితే ఆరోగ్య ప్రయోజనాలెన్నో!

ఇంటర్నెట్‌డెస్క్


వేసవిలో విపరీతమైన ఎండల వల్ల చెమటలు పట్టడం డీహైడ్రేషన్‌కి గురవ్వడం జరుగుతుంటుంది. రోజుకి ఎన్ని నీటిని తాగినా సరే నోరు ఎండిపోతుంది. చల్లని నీరు లేదా, కొబ్బరి నీళ్లు ఇలా రకరకాలుగా పానీయాలు తీసుకున్నా సరే ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ కాలంలో నీటిలో చిటికెడు ఉప్పు కలుపుకుని తాగితే ఆరోగ్యానికి మంచిదని, ముఖ్యంగా డీహైడ్రేషన్‌కి గురయ్యే ప్రమాదం తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

-- వేసవిలో విపరీతంగా చెమట పడుతుంది. దీంతో చెమట రూపంలో సోడియం మాత్రమే కాకుండా ముఖ్యమైన ఎలక్ట్రోలైట్లను కూడా కోల్పోతాము. అందుకే నీటిలో ఉప్పును కలిపి తాగితే తిరిగి శరీరానికి సోడియం అందుతుంది. తద్వారా డీహైడ్రేషన్ నుంచి కూడా తప్పించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

-- ఉప్పు నీటిని అందరూ తీసుకోకూడదు. రక్తపోటు అధికంగా ఉన్నవారు మాత్రం తప్పనిసరిగా ఉప్పునీటిని తీసుకోబోయే వైద్యుల్ని సంప్రదించడం మంచిది.

-- మూత్రపిండాల పనితీరు సాధారణంగా ఉన్న వ్యక్తులు కూడా ఉప్పునీటిని తీసుకోవాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.

# గొంతు గర గర పోవాలంటే



ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయి. ఈ సమయంలో బ్యాక్టీరియా మన శరీరంపై దాడికి సిద్ధమవుతుంది. ముఖ్యంగా గొంతు సమస్యలు తెగ ఇబ్బంది పెడతాయి. గొంతులో గరగరగా ఉందంటే మన శరీరంలోకి ఏవో బ్యాక్టీరియా ప్రవేశిస్తోందని, వాటిపై మన రోగ నిరోధక శక్తి పోరాడుతోందని అర్థం. జలుబు, జ్వరం, అలెర్జీలు, కాలుష్యం, పొగ వంటివి గొంతు గరగరకు దారితీస్తాయి. దీన్ని సులభంగా దూరం చేసుకోవాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.

-- గోరు వెచ్చని పాలలో అర టీ స్పూన్ పసుపు వేసి తాగాలి. ఇలా చేస్తే గొంతులో గరగర మాయమవుతుంది.

-- అల్లాన్ని పేస్ట్ చేసి, దాల్చిన చెక్కను పొడి చేసి, వాటితో టీ పొడి కలిపి టీ పెట్టుకొని తాగాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే ఫలితం కనిపిస్తుంది.

-- అల్లాన్ని మెత్తగా నూరి, టీలో కలిపి ఐదు నిమిషాలు మరిగించి తాగినా మంచి ఫలితం ఉంటుంది.

-- పుదీనా ఆకుల్ని నీటిలో వేసి ఐదు నిమిషాలు మరిగించి, ఆకులు తీసివేసి, ఆ నీళ్లు తాగాలి.

# మామిడి పండ్లు తినగానే ఇవి తీసుకుంటున్నారా..

## అయితే మీ ఆరోగ్యాన్ని రిస్క్‌లో పెట్టినట్లే..!

**వేసవి ఆగమనంతోనే మార్కెట్‌లోకి మామిడి పండ్ల (ఘ్రుఅస్త్రశీవం) రాక మొదలవుతుంది. మన దేశం మామిడి పండ్లకు ఎంతో ప్రసిద్ధి. ప్రపంచంలో మరెక్కడా లభించనన్ని రకాల మామిడి పండ్లు భారత్‌లో లభిస్తాయి. అంతేకాదు దేశంలోని మామిడిపండ్లు రకరకాల రుచుల్లో అందుబాటులో ఉంటాయి. ఈ మామిడి పండ్లను నేరుగా తినొచ్చు. జ్యూస్‌లుగా చేసుకుని తాగవచ్చు. మామిడి తాండ్ర, మామిడి కరేలా లాంటి పదార్థాలు తయారు చేసుకుని కూడా తినొచ్చు. అయితే ఈ మామిడిపండ్లు తిన్న తర్వాత ఓ ఐదు రకాల పదార్థాల జోలికి అస్సలు పోవద్దట. ఆ పదార్థాలేమిటో ఇప్పుడు చూద్దాం..**

మంచి నీళ్లు : మామిడి పండ్లు తిన్న తర్వాత కొంతసేపటి వరకు మంచినీళ్లను అస్సలు తాగొద్దట. అలా చేస్తే ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందట. కడపు నొప్పి, అసిడిటీ, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట.

పెరుగు : మామిడి పండు తినగానే పెరుగు తీసుకుంటే శరీరం డీహైడ్రేట్ అవుతుందట. అందువల్ల అలాంటి అలవాటు ఉంటే తక్షణమే మానుకోవాలట. లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందట. అంతేగాక చర్మ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉన్నదట.

కాకరకాయ : మామిడి పండ్లు తిన్న తర్వాత కాకరకాయ తీసుకోవడం కూడా మంచిది కాదట. అలా చేయడంవల్ల వికారం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు వస్తాయట.

ఘాటైన పదార్థాలు : మామిడి పండ్లు తిన్న తర్వాత ఘాటు పదార్థాలుగానీ, కారం పదార్థాలుగానీ తీసుకుంటే ఉదర సంబంధ సమస్యలు, చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట. అంతేగాక ముఖంపై మొటిమలు వచ్చే ప్రమాదం కూడా ఉన్నదట.

చల్లటి పానీయాలు : మామిడి పండ్లతోపాటు చల్లటి పానీయాలు తీసుకోవడం కూడా ఆరోగ్యానికి హానికరమట. చల్లటి పానీయాలతో మామిడి పండ్లను తీసుకోవడంవల్ల షుగర్ లెవల్స్ మరింత పెరుగుతాయట.



# రీ సర్వే ప్రాంతాల్లో అధికారుల తనిఖీ

-- సీఎం టూర్ నేపథ్యంలో కసరత్తు



**బాపట్ల ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్న ప్రాంతాల ఏర్పాట్లను సి.సి.ఎల్.ఏ కార్యదర్శి జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ సోమవారం కలిసి పరిశీలించారు. వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో ఈ నెల 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు విస్తృతంగా ఏర్పాట్లను సమీక్షించారు. గ్రామానికి చేరుకున్న వారు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలిస్తూ, సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న రీ-సర్వే ప్రాంతాలను పరిశీలించిన అధికారులు, అక్కడి భూమి యజమానులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రెవెన్యూ దస్త్రాలలో నమోదు అయిన వివరాలను సమీక్షిస్తూ, రీ-సర్వే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. సీఎం పర్యటించే ప్రదేశాల్లో జరుగుతున్న ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.అనంతరం గ్రామ సచివాలయం వద్ద అధికారులతో సమావేశమై, పర్యటన ఏర్పాట్ల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, రేపల్లె ఆర్డీవో శ్రీదేవి, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడి శేషగిరిరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాపట్లలో బాలవనం ప్రారంభం

-- చిన్నారులకు సరికొత్త ఆహ్లాద వేదిక
--ఖాళీ స్థలానికి సుందరీకరణతో పార్క్ ఏర్పాటు
-- ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు



**బాపట్ల ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
బాపట్ల పట్టణ ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే దిశగా నూతనంగా ఏర్పాటు చేసిన బాపట్ల బాలవనం (చిన్నారుల పార్కు)ను ఘనంగా ప్రారంభించారు. పట్టణంలోని 9వ వార్డు గుంటూరు బ్రిడ్జి కింద అభివృద్ధి చేసిన ఈ పార్కును రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్‌లతో కలిసి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించి పార్కులోని సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ, వాడుకలో లేని ఖాళీ స్థలాన్ని సుందరీకరించి చిన్నారుల కోసం 'బాలవనం'గా తీర్చిదిద్దడం ఆనందదాయకమని తెలిపారు. పట్టణ ప్రజలకు విశ్రాంతి, వినోదం కల్పించే ప్రదేశాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాబోయే రోజుల్లో బాపట్లను అన్ని రంగాల్లో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.
కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్, బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, ఆర్‌డీఓ గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దార్ సలీమా, బాపట్ల పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ ఆవిర్భావ వేడుకలు



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లెలో బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు బోరెడ్డి లక్ష్మిరెడ్డి, మండల అధ్యక్షుడు నరేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. 1980లో స్థాపించిన నాటి నుంచి బీజేపీ దేశాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని వారు పేర్కొన్నారు. ప్రతి ఏటా ఏప్రిల్ 6న ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో.. దేశంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది..!

- ఆలూరు నియోజకవర్గంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో బిజెపి నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ, ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ



**ఆలూరు, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
భారత ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో దేశం అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోందని ఆలూరు బిజెపి నాయకురాలు గుమ్మనూరు కమలమ్మ, ఆలూరు మాజీ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణలు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆలూరు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరులో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆలూరులో బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఆ తరువాత నియోజకవర్గ పరిధిలోని హాల హర్వి మండలం పచ్చర్లపల్లిలో కూడా వారు బిజెపి జెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి సాధించిందన్నారు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రపంచ దేశాలు భారత వైపు తొంగి చూడడానికే సాహసించలేకపోతున్నాయన్నారు. అంతటి పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టారని చెప్పారు. అలాగే ఆంధ్ర రాష్ట్రంలో పివిఎన్ మాధవ్ నేతృత్వంలో బిజెపి బలపడుతోందన్నారు. కర్నూలు జిల్లాలో బిజెపి బలోపేతానికి ముఖ్యంగా ఆలూరు నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కలసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 6వ తేదీ నుండి 14వ తేదీ వరకు మన ఊరు – మన జెండా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారుఈ కార్యక్రమంలో బిజెపి కిషన్ మోర్చా జిల్లా సెక్రెటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# విబిజి రాంజీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలి...సిపిఐ




**పత్తికొండ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం విధిగా కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబి జిరాంజీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ఈనెల 10,11,12 వ తేదీల్లో అనంతపురం నుండి బండ్లపల్లి వరకు సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే పాదయాత్ర వాల్ పోస్టర్లను సోమవారం సిపిఐ కార్యాలయంలో విడుదల చేశారు.ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ భీమిలింగప్ప,జిల్లా కార్యదర్శి నబిరసూల్, సిపిఐ మండల కార్యదర్శి యు.కారమంచి లు మాట్లాడుతూ 10,11,12,వ తేదీల్లో జరగబోయే కార్యక్రమానికి సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజా,జాతీయ నాయకులు రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య,లు హాజరవుతారు అన్నారు.కావున పెద్ద ఎత్తున జాతీయ ఉపాధి కార్మికులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి గురుదాసు కాశీనాథ్,తిమ్మప్ప,సిద్దు,తదితరులు పాల్గొన్నారు

# బిజెపి జెండా దేశ ప్రజలకు అండ

-బిజెపి యువ మోర్చా మండల అధ్యక్షులు :శివ కేశవ



**ప్యాపిలి ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
బిజెపి జెండా దేశ ప్రజలకు అండ అని నంద్యాల జిల్లా కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు కేసీ మద్దిలేటి, ప్యాపిలి మండల బిజెపి అధ్యక్షులు కేబి.దామోదర్ నాయుడు, యువ మోర్చా ప్యాపిలి మండలం అధ్యక్షులు శివ కేశవులు అన్నారు . భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో బిజెపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు.ముందుగా పట్టణంలో మొట్టమొదటిసారి యువ మోర్చా అధ్యక్షులు శివ కేశవ ఆధ్వర్యంలో జండా కట్టను ఏర్పాటు చేసి,పతాకావిష్కరణ గావించారు.ఈ సందర్భంగా యువమోర్చా అధ్యక్షులు శివకేశవ మాట్లాడుతూ దేశాభివృద్ధికి కట్టుబడిన పార్టీ బిజెపి పార్టీ అని విప్లవాత్మక నిర్ణయాలతో పిఎం నరేంద్ర మోడీ దేశాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో ఉంచారని అమరావతి నిర్మాణంతో సహా ఏపీ అభివృద్ధికి తమ ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. ప్యాపిలి , జలదుర్గం గ్రామాలలో బిజెపి జండాను ఆవిష్కరించడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సభ్యత్వాల పెంపుదలకు సహకరించండి

-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




**నంద్యాల, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాల అభివృద్ధికి ప్రతి శాఖాధికారి సహకరించాలని జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో రెడ్ క్రాస్ సభ్యత్వాల పెంపుదలకు అధికారులు చురుకుగా ముందుకు రావాలని ఆమె సూచించారు. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అనేక సంక్షేమ కార్యక్రమాలు జిల్లాలో అమలు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవలను అందించేందుకు సభ్యత్వాల పెంపు కీలకమని పేర్కొన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు. అనంతరం జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) సేకరించిన 56 రెడ్ క్రాస్ శాశ్వత సభ్యత్వాల దరఖాస్తులు మరియు వాటికి సంబంధించిన రూ.61,600 నగదును జడ్పీ సీఈఓ ద్వారా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుబ్బారెడ్డి, మండల పరిషత్ ఏవో షాన్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా సెక్రటరీ మరియు స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ట్రెజరర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పింఛన్ల పంపిణీ



**బనగానపల్లె , ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
అనారోగ్యంతో బాధపడుతోన్న ఏడుగురికి సొంత నిధులతో పింఛన్లను టిడిపి నాయకురాలు బిసి ఇందిరా రెడ్డి పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఏడు మందికి సొంత నిధులతో ప్రతి నెలా రూ.3వేల చొప్పున పింఛన్ బిసి ఇందిరా రెడ్డి పంపిణీ చేశారు. కైపాలో ముగ్గురు, సంకలాపురంలో ఇద్దరు, చెరువుపల్లె, కొలిమిగుండ్ల గ్రామాలలో ఒక్కొక్కరు చొప్పున పింఛన్ అందుకుంటున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక'



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ కిషోర్, తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి పాల్గొన్నారు. ఇంటి పన్ను, వార్డుల్లోని పలు సమస్యలపై లబ్ధిదారులు అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం కలెక్టర్ రాజకుమారి నిర్వహించిన వీసీలో మున్సిపల్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

## నలుగురు విద్యుత్ ఆపరేటర్ల తొలగింపు



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని రుద్రవరం మండలంలో నకిలీ ధృవపత్రాలతో ఉద్యోగంలో చేరిన నలుగురు ఆపరేటర్లపై వేటుపడింది. యవత్తుల సబ్ స్టేషన్ ఆపరేటర్ హరి, చిన్నకంబలూరులో పెద్దిరెడ్డి, ఆలమూరులో నరసింహ నాయక్, హరినగరంలో ఆంజనేయులను అధికారులు విధుల నుంచి తొలగించారు. ఈ విషయాన్ని AE రాజశేఖర్ ధృవీకరించారు. ఉన్నతాధికారుల తనిఖీల్లో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగుచూసింది. తప్పుడు పద్ధతుల్లో చేరినవారిపై చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## మొరాయిస్తున్న మున్సిపల్ చెత్త వాహనం.

-ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం.
-పరిష్కరించిన ఎస్సై రాజకుల్లాయప్ప.



**గూడూరు, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
గూడూరు నగర పంచాయతీలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో చెత్తను సేకరించి తరలించే ట్రక్కులు, ట్రాక్టర్ల నిర్వహణ తీరులో నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో వాహనాలను మెయింటెన్ చేయడంలో, ఇంధనాలు సరిగా వేయించక పోవడంతో రోడ్డు మధ్యలో ఆగిపోతున్న సంఘటనలు గూడూరు నగర పంచాయతీలో ఉన్నాయి. సోమవారం పట్టణంలోని ప్రధాన కూడలిలో చెత్త ట్రక్కు నిలిచిపోవడంతో ట్రాఫిక్కు తీవ్ర ఇబ్బందులు కలిగింది. చాలా వాహనాలు రోడ్డుపైన నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన ఎస్సై రాజా కుల్లాయప్ప వాహనాన్ని అక్కడినుంచి తరలించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ఇదే సమయంలో చెత్త ట్రాక్టర్ కూడా డీజిల్ అయిపోవడంతో రోడ్డుపై నిలిచిపోయింది. ఈ రెండు సంఘటనలతో మున్సిపల్ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనబడుతుంది. ఉన్నతాధికారులు గూడూరు నగర పంచాయతీ పై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకి సేవ మహోత్సవం



**బనగానపల్లె ,ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రదోషకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఆలయ కార్యనిర్వణ అధికారి పాండురంగారెడ్డి , ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వరరెడ్డి ,పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వర రెడ్డి , అర్చకులు ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఏపీ రైతు సంఘం డిమాండ్..



**దేవనకొండ:ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు వై. శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐకేఎస్ జిల్లా సమితి పిలుపు మేరకు దేవనకొండ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రీ-సర్వే ప్రక్రియలో పారదర్శకత లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సాగులో ఉన్న వాస్తవ విస్తీర్ణానికి అనుగుణంగా సరిహద్దులు నిర్ణయించాలని, ఎక్కడా భూమి తగ్గకుండా చూడాలని కోరారు. రీ-సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించి రైతులకు నమ్మకం కలిగించాలన్నారు. సాగులో ఉన్న భూమి విస్తీర్ణం పెరగకుండా, తగ్గకుండా శాస్త్రీయంగా కొలతలు వేయాలన్నారు. రైతు కోరిన వెంటనే పొలం సరిహద్దులను చూపి, వాటికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సర్వే పేరుతో రైతుల మధ్య అనవసరమైన తగాదాలు సృష్టించకూడదన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ కార్యాలయాల్లో రైతుల నుంచి లంచాలు డిమాండ్ చేయకుండా, ఎటువంటి వేధింపులు లేకుండా న్యాయమైన సేవలు అందించాలన్నారు. రీ-సర్వే వల్ల రైతులకు మేలు జరగాలి కానీ, నష్టం వాటిల్లకూడదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆంజనేయ వీరాంజి విజయ భాస్కర్ రెడ్డి రామాంజనేయులు భాస్కర్ శ్రీనివాసులు కోదండ రంగన్న నాగరాజు సుధాకర్ పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ కోసం పటిష్ట చర్యలు

### డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి





**డోన్ ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
నీటి సంరక్షణ కోసం పటిష్ట చర్యలు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించిందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి తెలిపారు. నీటి భద్రతపై ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగు నీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో భాగంగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి సోమవారం డోన్ మండలంలోని వెంకటాపురం చెరువును సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువు ప్రస్తుత పరిస్థితులు, నీటి నిల్వ సామర్థ్యం, మరమ్మతుల అవసరాలు, భూగర్భజలాల స్థితిగతులపై అధికారులకు అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...రాష్ట్రంలో నీటి భద్రతను బలోపేతం చేస్తేనే వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి వంటి అన్ని రంగాల్లో స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పూర్తిగా కరవురహితంగా మార్చడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూగర్భ జలాల అందుబాటును పెంచే దిశగా ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలు నిర్ణయించినట్లు తెలియజేశారు. వేసవికంటే ముందుగా భూగర్భజలం 6 మీటర్ల లోపల అందుబాటులో ఉండాలి వర్షాకాలం పూర్తయ్యే నాటికి ఈ లోతు 3 మీటర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలి అని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీటి సంరక్షణ కోసం ప్రత్యేకంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించామని, దీనిలో భాగంగా వాటర్ బడ్జెట్, వాటర్ ఆడిట్ నిర్వహణ చెరువులు, కాల్వలు, చెక్‌డ్యాంలు పునరుద్ధరణ నీటి నిల్వ సామర్థ్యం పెంపు భూగర్భజలాల రీచార్జ్‌పై ప్రత్యేక దృష్టి వంటి కీలక కార్యక్రమాలు అమలులో ఉన్నాయని తెలిపారు. స్థానిక సాగునీటి సంఘాలు ఈ కార్యక్రమాలకు పాలుపంచుకొని, నీటి భద్రతను సాధించడం తమ ప్రధాన బాధ్యతగా భావించి పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. చెరువుల పునరుద్ధరణ ద్వారా నీటి నిల్వ పెరుగుతుందని, రైతులకు సాగునీటి అందుబాటు మెరుగౌతుందని, దీని ద్వారా ప్రాంతీయ వ్యవసాయోత్పత్తి పెరుగుతుందని అన్నారు. ప్రజల సహకారం, సంఘాల చురుకైన పాత్రతో డోన్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నీటి సంరక్షణ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ పెరుగు శ్రీనివాసులు, నీటి సంఘం ఉపాధ్యక్షులు అబిరెడ్డిపల్లె గోవింద్ ,టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మల్లెంపల్లె జయన్న, మైనర్ ఇరిగేషన్ అధికారులు గ్రామ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు... సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ PGRS సమస్యల పరిష్కారంలో మరింత శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ను స్పష్టంగా ఇవ్వడం లేదని, అందువల్ల సంతృప్తి శాతం తగ్గుతోందన్నారు. ఎండార్స్మెంట్ స్పష్టంగా ఉండాలని, ఒక వేళ సమస్య పరిష్కరించ లేకపోతే ఎందువల్ల సమస్యను పరిష్కరించలేకపోతున్నామో, పిటిషనర్లకు బాగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.. చాలా మంది అధికారులు గడువు ముగిసే చివరి నిమిషంలో (ఉదాహరణకు 100 రోజులు సమయం ఉంటే 90వ రోజున) దరఖాస్తులను చూసి హడావుడిగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇలా చేయకూడదని,ఫిర్యాదు అందిన మొదటి రోజే దానిని పరిశీలించి, పరిష్కారానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పిటిషనర్ ఫిర్యాదు అందిన వెంటనే వారితో మాట్లాడాలన్నారు. ఒక సర్వేయర్ 5 మంది పిటిషనర్ల కు సంబంధించి సర్వే చేసినప్పటికీ, సర్వే సర్టిఫికేట్ ఇవ్వనందున అతని ఇంక్రిమెంట్లు కట్ చేయడం జరిగిందన్నారు. పనిలో నిర్లక్ష్యం వహిస్తే ఎవరిపైనైనా కఠిన చర్యలు ఉంటాయన్నారు. రీఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ పూర్తిగా శాతాన్ని తగ్గించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 22 ఏ, చుక్కల భూముల సమస్యలకు పరిష్కారం

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**కర్నూలు, ఏప్రిల్ 6(డ్రీమ్ టైమ్స్):**
జిల్లాలో 22 ఏ, చుక్కల భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో 22 ఏ, చుక్కల భూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి కర్నూలు రూరల్, వెల్దుర్తి మరియు తుగ్గలి మండలాలకు చెందిన పది మంది రైతులకు కలెక్టర్ ప్రొసీడింగ్స్ ను అందచేశారు. కర్నూలు రూరల్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన జె. రామాంజనేయులు, శేషిరెడ్డి, గార్గేయపురం గ్రామ నివాసి నల్లగొట్ల లక్ష్మన్న, వెల్దుర్తి మండలం నర్సాపురం గ్రామానికి చెందిన దేశపోగు లక్ష్మమ్మ, దేశపోగు ఆంజనేయ, తుగ్గలి మండలానికి చెందిన ఉప్పరి సుబ్బరాయుడు, చంద్రశేఖర్ లకు చెందిన 22 ఏ, చుక్కల భూములకు పరిష్కారం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 22 ఏ, చుక్కల భూముల సమస్యలను పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 22 ఏ సమస్యలకు సంబంధించి ఈ ఏడాది 242 సమస్యలను పరిష్కరించడం జరిగ్9దాని, 32 వేల ఇనాం నుండి పట్టా సమస్యలను పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు.

# బిజినెస్

## మరోసారి కుప్పకూలిన బంగారం ధరలు..

### ఒక్కసారిగా భారీగా డౌన్.. లేటెస్ట్ రేట్లు ఇవే..



బంగారం కొనుగోలు చేసేవారికి భారీ గుడ్ న్యూస్. ధరలు తారుమారు అయ్యాయి. ఒక్కసారిగా ధరలు మారిపోయాయి. సోమవారం గోల్డ్, సిల్వర్ రేట్లు భారీగా కుప్పకూలాయి. అంతర్జాతీయ పరిణామాల క్రమంలో పసిడి ధరలు పతనమయ్యాయి. రెండు రోజులుగా ధరలు పెరుగుతుండగా.. ఇప్పుడు వాటికి బ్రేక్ పడింది. దీంతో కొనుగోలుదారులు ఊరట చెందుతున్నారు. సోమవారం వివిధ నగరాల్లో రేట్లు ఎలా ఉన్నాయో చూద్దాం.హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,130 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,50,930 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే ఇవాళ రూ.1800 తగ్గింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,36,700 వద్ద ట్రేడవుతుండగా.. నిన్న రూ.1,38,350 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.1650 తగ్గుముఖం పట్టింది.విజయవాడ, విశాఖపట్నంలో కూడా అవే ధరలు ఉన్నాయి. ఇక చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,170గా ఉండగా.. నిన్న రూ.1,52,180 వద్ద కొనసాగింది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,490 వద్ద ట్రేడవుతోంది. నిన్న ఆ ధర రూ.1,39,500గా ఉంది. ఇక బెంగళూరులో కూడా గోల్డ్ రేట్లు పడిపోయాయి.బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,49,130గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,36,700 వద్ద ట్రేడవుతోంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ రేటు రూ.1,49,280గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,36,850 వద్ద ఉన్నాయి.ఇక ఢిల్లీలో కిలో వెండి రూ.2.50 లక్షలుగా ఉంది. ఇక చెన్నైలో రూ.2,54,900 వద్ద ట్రేడవుతున్నాయి. ఇక బెంగళూరులో రూ.2.50 లక్షల వద్ద కొనసాగుతున్నాయి. అటు హైదరాబాద్‌లో కేజీ సిల్వర్ రూ.2.55 లక్షల వద్ద కొనసాగుతున్నాయి.

## నష్టాల్లో ప్రారంభమై లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### 787 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

భారత స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్ నష్టాల్లో ప్రారంభమైనప్పటికీ, మధ్యాహ్నం నుంచి లాభాలబాటపట్టాయి. ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 787 పాయింట్ల లాభంతో ముగిసింది. ఉదయం సెన్సెక్స్ 73,477.53 పాయింట్ల వద్ద స్వల్ప నష్టంతో ప్రారంభమైంది. ఇంట్రాడేలో మరింత నష్టపోయి 72,728.66 పాయింట్ల కనిష్ట స్థాయికి చేరిందిఇదే సమయంలో ఇరాన్-అమెరికా మధ్య కాల్పులు విరమణ అంశంలో ప్రకటన వెలువడటం మార్కెట్ వర్గాలకు కలిసొచ్చింది. మార్కెట్ లాభాలబాట పట్టింది. ఒక దశలో సెన్సెక్స్ 74,207.46 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు 787.30 పాయింట్లు (1.07 శాతం) లాభంతో 74,106.85 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 255.15 పాయింట్ల (1.12 శాతం)



లాభంతో 22,968.25 పాయింట్ల వద్ద ముగిసింది. లాభాల కారణంగా ఇన్వెస్టర్ల సందప ఒక్క రోజే ఏకంగా రూ.5 లక్షల కోట్లు పెరిగింది. దీంతో భారతీయ మార్కెట్ల విలువ రూ.427 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ రోజు కన్స్యూమర్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ షేర్లు దూసుకెళ్లగా, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ షేర్లు మాత్రం భారీగా నష్టపోయాయి. ఇక, డాలర్‌తో రూపాయి మారకం విలువ స్వల్పంగా బలపడి 93.05గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 108 డాలర్లకు చేరింది. అలాగే, బంగారం ఔన్స్ 4689 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఈ రోజు సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఎల్‌అండ్ టీ, అల్ట్రా టెక్ సిమెంట్, టైటాన్ సంస్థలు లాభాల్లో ముగిశాయి. మార్కెట్ పుంజుకోవడానికి ప్రధాన కారణం.. ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ ప్రతిపాదనలో ముందడుగు పడటమే. ఇరు దేశాలకు చెందిన ప్రతిపాదనలు రెండు వైపులా చేరాయి. ఈ పరిణామంతో క్రూడాయిల్ ధర తగ్గింది. రూపాయి విలువ బలపడింది.

## భారత వృద్ధి అంచనాలకు కోత

**-6.9 శాతం దిగువనే ఉండొచ్చు**

**-ఐసిఐసిఐ బ్యాంక్ రిపోర్ట్**

**ముంబయి**

ప్రస్తుత అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఇంధన వనరుల సరఫరాలో ఏర్పడిన ఆటంకాలతో భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి తగ్గొచ్చని ఐసిఐసిఐ బ్యాంక్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో భారత జిడిపిని గతంలో అంచనా వేసిన 7.2 శాతం నుండి 6.8-6.9 శాతానికి తగ్గిస్తున్నట్లు పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసులో తలెత్తిన అవరోధాలు దేశీయ ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్నాయని బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది.
ముఖ్యంగా పారిశ్రామిక రంగానికి అవసరమైన ఇంధన సరఫరాపై ఈ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. "పారిశ్రామిక ఇంధన సరఫరాపై ఆంక్షలు ఉన్నందున, గృహ అవసరాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల ఎరువులు, సిరామిక్స్, లోహాలు, గాజు వంటి రంగాల ఉత్పత్తి ప్రభావితమయ్యే అవకాశం ఉంది" అని ఐసిఐసిఐ బ్యాంక్ నివేదిక స్పష్టం చేసింది. గతంలో 2022లో ఇంధన ధరలు పెరిగినప్పుడు తయారీ రంగం ఏ విధంగా మందగించిందో గుర్తు చేసింది. ప్రస్తుతం మార్చి నెల తయారీ పిఎంఐ 53.9కి పడిపోవడం తక్షణ ప్రభావానికి నిదర్శనమని పేర్కొంది.
విదేశీ వాణిజ్యం, చమురు ధరల ప్రభావంపై ఐసిఐసిఐ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది. చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల వద్ద కొనసాగడం వృద్ధికి ప్రతికూలమని తెలిపింది. చమురు ధరలు 111 డాలర్ల వద్ద ఉన్నప్పుడు (2012-14) వాస్తవ జిడిపి 5.7 శాతానికి పడిపోయిన విషయాన్ని గుర్తు చేసింది. ప్రస్తుతం సరఫరా పరిమితులు హార్ముజ్ జలసంధి దిగ్బంధనం వల్ల ఎగుమతులు దెబ్బతినడం వంటి అంశాలు 2025-26లోని నాలుగో త్రైమాసికం, 2026-27లో మొదటి త్రైమాసికంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఐసిఐసిఐ బ్యాంక్ తన నివేదికలో వెల్లడించింది. ఎగుమతుల్లో 15 శాతం వాటా ఉన్న గల్ఫ్ దేశాలకు రవాణా నిలిచిపోవడం కూడా ఈ వృద్ధి కోతకు మరో ప్రధాన కారణమని తెలిపింది.

# స్పోర్ట్స్

## ఐపీఎల్‌కు శ్రీలంక బౌలర్లు సిద్ధమేనా.. ఫిట్‌నెస్ టెస్టు ఎప్పుడు..?

పంతొమ్మిదో సీజన్ మొదలై వారం దాటినా కొందరు ప్రధాన బౌలర్లు మాత్రం ఇంకా భారత్‌కు చేరుకోలేదు. వేలంలో భారీ ధర పలికిన మథీశ పథిరన, మిస్టరీ స్పిన్నర్ వనిందు హసరంగల ఆగమనంపై కూడా స్పష్టత లేదు. శ్రీలంక క్రికెట్ కొత్త నిబంధనల ప్రకారం వీరిద్దరూ ఫిట్‌నెస్ టెస్టు పాసైతేనే ఐపీఎల్ ఆడే అవకాశముంది. ఈ నేపథ్యంలో వీరిద్దరు ఎప్పుడు ఫిట్‌నెస్ టెస్టుకు హాజరవుతారు? తమ ఫ్రాంచైజీతో ఎప్పుడు కలుస్తారు? అనేది అభిమానుల్లో ఆందోళనకు కారణమవుతోంది.ప్రధాన పేసర్ల కొరతతో అల్లాడుతున్న కోల్‌కతా నైట్ రైడర్స్ పథిరన రాక కోసం ఎదురుచూస్తోంది. మరోవైపు లక్నో సూపర్ జెయింట్స్ సైతం మ్యాచ్ విన్నరైన హసరంగ ఎప్పుడొస్తాడా? అని ఆశగా ఉంది. అయితే.. ఈ మధ్యే ముగిసిన పొట్టి ప్రపంచకప్‌లో గాయపడిన యార్కర్ కింగ్ మథీశ పథిరన, వనిందు హసరంగ కోలుకుంటున్నారు. వీరు ఇంకా ఫిట్‌నెస్ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంది.అయితే.. ఐపీఎల్ ఆడేందుకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం హసరంగ ఇంకా



లంక బోర్డుకు దరఖాస్తు చేసుకోలేదు. పథిరన మాత్రం నెట్స్‌లో బౌలింగ్ సాధన చేస్తున్నాడు. అతడు ఫిట్‌నెస్ టెస్టు పాసై.. ఏప్రిల్ మూడో వారంలో ఐపీఎల్ కోసం భారత్‌కు వచ్చే అవకాశాలున్నాయి. లంక బోర్డు కొత్తగా తీసుకొచ్చిన ఫిట్‌నెస్ నిబంధనలపై క్రికెటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతివ్వాలని ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నువాన్ తుషార ఏకంగా కోర్టునే ఆశ్రయించిన విషయం తెలిసిందే.

## ఆసియా ఛాంపియన్‌షిప్స్ నుంచి వైదొలిగిన సాత్విక్ - చిరాగ్ జోడీ.. ఆ ఇద్దరిపైనే ఆశలన్నీ..!

భారత స్టార్ డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి మరో మెగా టోర్నీ నుంచి వైదొలిగారు. ఇప్పటికే గాయం కారణంగా స్విస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్ ముందే నిష్క్రమించిన ఈ జోడీ ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ లో ఆడడం లేదు. సాత్విక్ భుజం గాయంతో బాధ పడుతున్నందున టోర్నీ నుంచి వైదొలగుతున్నట్టు పీటీఐ వార్తా సంస్థతో కోచ్ టాన్ కిమ్ హెర్ వెల్లడించాడు.ఆ ఏడాది సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టిలకు కలిసి రావడం లేదు. ఈ మధ్య కాలంలో వీరిద్దరు ఫిట్‌నెస్ సమస్యలతో సతమతమవుతున్నారు. గాయం కారణంగా స్విస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో ఆడలేకపోయిన భారత జోడీ.. మరోసారి గాయం



వల్లనే బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో ఆడడం లేదు. 2023లో విజేతగా నిలిచిన సాత్విక్ -- చిరాగ్ జంట నిష్క్రమణతో లక్ష్య సేన్, పీవీ సింధులపైనే పతకం ఆశలు పెట్టుకుంది భారత్ పురుషుల సింగిల్స్‌లో సేన్, మహిళల సింగిల్స్‌లో సింధులు సత్తా చాటాలనే పట్టుదలతో ఉన్నారు. భుజం గాయం నుంచి కోలుకుంటున్న హెచ్‌హెస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్‌లు బరిలో దిగుతున్నా ఇటీవలి ఫామ్ దృష్ట్యా పతకం ఖాయమని చెప్పలేం. బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో దినేశ్ ఖన్నా 1965 పురుషుల సింగిల్స్‌లో స్వర్ణ పతకం గెలుపొందాడు.

## ప్రపంచ రికార్డును కోల్పోయిన టిమ్ డేవిడ్..!



ఆర్సీబీ విధ్వంసకర ప్లేయర్ టిమ్ డేవిడ్ సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో అదరగొట్టాడు. కేవలం 25 బంతుల్లోనే 70 రన్స్ చేసి ఆకాశమే హద్దుగా చెలరేగాడు. టిమ్ విధ్వంసంతో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో సీఎస్‌కే 19.4 ఓవర్లలో 207 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆర్సీబీ 43 పరుగుల తేడాతో గెలుపొందింది. అయితే టిమ్ డేవిడ్ ఒక్క పరుగు తేడాతో ప్రపంచ రికార్డును కోల్పోయాడు. పురుషుల టీ20 క్రికెట్‌లో 15వ ఓవర్ తరువాత బ్యాటింగ్‌కు వచ్చి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడి రికార్డు డానియల్స్ సామ్స్ పేరిట ఉంది. అతడు 2022లో ససెక్స్‌పై 71 పరుగులు చేశాడు. తాజాగా టిమ్ డేవిడ్ 70 పరుగులు చేశాడు. అద్భుత ప్రదర్శన చేసినందుకు గానూ టిమ్ డేవిడ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకున్నాడు. అవార్డును తీసుకున్న తరువాత అతడు మాట్లాడుతూ.. రజత్ పాటిదార్‌పై ప్రశంసల వర్షం కురింంచాడు. నిజం చెప్పాలంటే ప్రస్తుతం నేను ఎంతో సంతోషంగా ఉన్నాను. ఇలా ప్రతి రోజు జరగదు. ఇక కెప్టెన్ రజత్ పాటిదార్ అద్భుతంగా ఆడుతున్నాడు. అతడు ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తీసుకువస్తున్నాడని డేవిడ్ అన్నాడు. ఇక తాను వివిధ స్థానాల్లో బ్యాటింగ్ చేయడం గురించి మాట్లాడుతూ.. తాను అదృష్టవంతుడినని చెప్పుకొచ్చాడు. తన ఆటను ఎక్కువగా మార్చకుండా ఆడేస్తున్నానని అన్నాడు. ఎక్కువ సేపు బ్యాటింగ్ చేసేందుకు అవకాశం ఉంది. సహచరులు, మేనేజ్‌మెంట్ నుంచి అద్భుతమైన మద్దతు ఉందన్నాడు.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?





మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## బ్లాక్ శారీలో పిచ్చెక్కిస్తున్న నభా

# 15 ఏళ్ల వయస్సులోనే డీప్‌ఫేక్ దెబ్బ...

### జాన్వీ కపూర్ భావోద్వేగ వ్యాఖ్యలు



అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతోంది. బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటూనే, తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు 'పెద్ది' సినిమాతో సిద్ధమవుతోంది. అయితే తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న జాన్వీ తన జీవితంలో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని వెల్లడించి అందరినీ ఆలోచనలో పడేసింది.జాన్వీ కపూర్ మాట్లాడుతూ, తాను కేవలం 15 ఏళ్ల వయసులోనే డీప్‌ఫేక్ టెక్నాలజీ కారణంగా ఒక విచిత్రమైన ఘటనను ఎదుర్కొన్నానని తెలిపింది. "అప్పుడు నేను స్కూల్‌లో చదువుకుంటున్నాను. ఒక రోజు నా ఫ్రెండ్ ఒక అశ్లీల వెబ్‌సైట్‌లో నా ఫోటో ఉందని చెప్పాడు. అది నిజానికి నా ఫోటో కాదు... డీప్‌ఫేక్ ద్వారా తయారు చేసిన ఫోటో" అని ఆమె చెప్పుకొచ్చింది. ఈ సంఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని జాన్వీ వెల్లడించింది. "ఆ ఫోటో గురించి తెలిసినప్పుడు నేను చాలా షాక్‌కు గురయ్యాను. ఏమి చేయాలో అర్థం కాలేదు. ఆ సమయంలో నేను చాలా బాధపడ్డాను. అదే సమయంలో సోషల్ మీడియా లో నైతికత ఎంత తక్కువగా ఉందో నాకు అర్థమైంది" అని ఆమె తెలిపింది. అప్పుడే నేను గ్రహించాను... భవిష్యత్తులో కూడా ఇలాంటి విషయాలు ఎదురవుతాయని. అందుకే ఇప్పుడు ఇలాంటి డీప్‌ఫేక్ ఫోటోలు వచ్చినా వాటిని ఎక్కువగా పట్టించుకోను అని జాన్వీ కపూర్ స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో టెక్నాలజీ దుర్వినియోగం ఎలా వ్యక్తిగత జీవితాలను ప్రభావితం చేస్తుందో ఈ ఘటన మరోసారి చూపిస్తోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ వంటి టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, సెలబ్రిటీలే కాక సాధారణ ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే, జాన్వీ కపూర్ ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉంది. తెలుగు చిత్రం 'పెద్ది'తో పాటు బాలీవుడ్‌లో కూడా వరుస ప్రాజెక్టులతో ఆమె కెరీర్ పీక్‌లో కొనసాగుతోంది.



# ప్రయోగాత్మక పాత్రలంటే ఇష్టం

'ఇందులో నేను చేసిన సరస్వతి పాత్ర చాలా డిఫికల్ట్. ఓ యాక్టర్‌కి ఛాలెంజింగ్ రోల్స్ చేయడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. మేకర్స్ కూడా ఆ పాత్రను సులభంగా అర్థమయ్యేలా తీర్చిదిద్దారు. అందుకే ఎంజాయ్ చేస్తూ నటించా. ఇప్పటివరకూ నేను చేయని జానర్ ఇది. ఇందులో స్టంట్స్ చేశాను. ఛేజింగులు చేశాను. ఫిజికల్‌గా చాలా కష్టపడ్డా. తెరపై అందరికీ నచ్చుతాననే అనుకుంటున్నా' అని మృణాళ్ ఠాకూర్ అన్నారు. అడివి శేష్‌కు జోడీగా ఆమె నటించిన పానిండియా యాక్షన్ రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకుడు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం మృణాళ్ విలేకరులతో ముచ్చటించింది.ఒక నటిగా ప్రయోగాత్మక పాత్రల్లో నటించడమంటే నాకిష్టం. అలాగే నాకు నేనే సర్‌ప్రైజ్ అవ్వడం ఇష్టం. అలాంటి అవకాశం ఈ పాత్ర ద్వారా వచ్చింది. ఈ కథ విన్నప్పుడు హరి(అడివి శేష్), సరస్వతి(మృణాళ్) ఎందుకు డెకాయిట్స్‌గా మారారు? అనేది చాలా ఆసక్తికరంగా అనిపించింది. ఒక డిఫరెంట్ లవ్‌స్టోరీ ఇది. ముఖ్యంగా అడివి శేష్ కోసం అంతా థియేటర్లకు వచ్చి ఈ సినిమా చూడాలని కోరుతున్నా. ఆయన బహుముఖ ప్రజ్ఞశాలి. అద్భుతంగా నటించారు. అన్నీ దగ్గరుండి చూసుకున్నారు. తెలుగుతోపాటు హిందీలోనూ ఈ సినిమాను షూట్ చేశాం. ఏ భాషవారికైనా నచ్చే సినిమా ఇది. ప్రకాశ్‌రాజ్, అనురాగ్ కశ్యప్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. ఇక దర్శకుడు షానియల్ దగ్గర్నుంచీ సాంకేతికంగా అందరూ అద్భుతంగా పనిచేశారు. కచ్చితంగా 'డెకాయిట్' అందరికీ నచ్చుతాడు' అన్నారు మృణాళ్‌ఠాకూర్.

# హీరోయిన్‌ను ఫైనల్ చేసిన అనిల్ రావిపూడి..



ఈ ఏడాది చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన మన శంకర వరప్రసాద్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్నాడు డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఈ మూవీ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న అనిల్ రావిపూడి 2027 సంక్రాంతికి విక్టరీ వెంకటేశ్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబోను సెట్ చేశాడని తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్లుగా ఎవరెవరు కనిపిస్తారనే దానిపై పలు వార్తలు ఇప్పటికే నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చేశాడు అనిల్ రావిపూడి.ప్రదీప్ రంగనాథన్ నటించిన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వన్ ఆఫ్ ది గెస్ట్‌గా హాజరయ్యాడు అనిల్ రావిపూడి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన నెక్ట్స్ సినిమాలో కృతిశెట్టి వన్ ఆఫ్ ది ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్నట్టు తెలిపాడు. కృతిశెట్టి నందమూరి కళ్యాణ్ రామ్‌కు జోడీగా కనిపించబోతుందట. మరి వెంకటేశ్‌తో రొమాన్స్ చేయబోయేది ఎవరనేది సస్పెన్స్ నెలకొంది. షైన్ స్క్రీన్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సంక్రాంతి ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలపై రాబోయే రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఇంతకీ ఈ ప్రాజెక్టు కోసం అనిల్ రావిపూడి ఎలాంటి కథను సిద్ధం చేశాడు. రెండో హీరోయిన్ ఎవరై ఉంటుందనే దానిపై ఏదైనా క్లారిటీ ఇస్తాడేమో చూడాలి.

# లవ్ ఇన్సూరెన్స్ ప్రేక్షకులకు నచ్చుతుంది: దిల్ రాజు



'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అంటూ ప్రేక్షకులను కొత్త కాన్సెప్ట్ మూవీతో అలరించేందుకు సిద్ధమయ్యారు ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి. వీరిద్దరూ జంటగా నటించిన ఈ చిత్రాన్ని విఘ్నేశ్ శివన్ తెరకెక్కించారు. నయనతార, ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మించారు. ఈనెల 10న రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు దిల్ రాజు, అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ టుడే' ప్రేక్షకులకు నచ్చుతుందని ముందే ఊహించినట్లు తెలిపారు. అందుకే తెలుగులో డబ్ చేయించినట్లు చెప్పారు.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831